విచ్చలవిడిగా బెల్టుషాపులు

- వినుకొండ నియోజకవర్గంలో అడ్డూ అదుపు లేని మద్యం విక్రయాలు
- ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల ఆదేశాలు బేఖాతరు
- అధికారులకు చుక్కలు చూపిస్తున్న నిర్వాహకులు
- చెప్పిందే చేయాలంటూ హెచ్చరికలు



గ్రామాల్లో బెల్టుషాపులకు తరలిస్తున్న మద్యం

సాక్షి నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన మద్యం విధానం టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తుంటే అధికారులకు మాత్రం చుక్కలు కనపడుతున్నాయి. వినుకొండ నియోజకవర్గంలో 19 మద్యం దుకాణాలు టెండర్ల ద్వారా దక్కించుకున్న నిర్వాహకులు అన్ని గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచి యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుపుతూ మందుబాబుల జేబులకు చిల్లుపెడుతున్నారు. బ్లాక్‌లో ఒక్కొక్క బాటిల్‌కు రూ.50లు ధరకు మించి అమ్ముతూ అందినకాడికి దోచుకుంటున్నారు. రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజులతో పాటు రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి రావడంతో అధిక ధరలకు మద్యం విక్రయించడం, బెల్టుషాపుల ద్వారా సొమ్ము చేసుకొని భారీగా లాభాలు ఆర్జించేందుకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో బెల్టు షాపులు కూడా టీడీపీ నేతల కనుసన్నల్లో వేలంపాటలు పెట్టి మరీ అనుచరులను ఏర్పాటు చేస్తున్నారు.

నేతల కనుసన్నల్లో అధికారులు

వినుకొండ ఎక్సైజ్ అధికారులు కనీసం బెల్టుషాపుల వైపు తనిఖీలు చేసేందుకు కూడా సాహసం చేయలేకపోతున్నారు. ఇటీవల వినుకొండ రూరల్ మండలం పిట్టంబండ గ్రామంలో మద్యం అమ్ముతున్నారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు నిర్వాహకుడు వెంటనే టీడీపీ నాయకులకు విషయాన్ని చేరవేశాడు. దీంతో ఎక్సైజ్ సీఐకి టీడీపీ నాయకులు ఫోన్ చేసి ఉద్యోగం చేయాలని ఉందా లేదా, మేము చెప్పినట్టు నడుచుకుంటేనే మీ ఉద్యోగాలు ఉంటాయని, స్వాధీనం చేసుకున్న బాటిళ్లను మా దుకాణంలో వదిలిపెట్టి వెళ్లాలని హుకుం జారీ చేశారు. దీంతో టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు మద్యం బాటిళ్లను నిర్వాహకుడి వద్ద వదిలి వెళ్లినట్లు సమాచారం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కూడా వినుకొండ రూరల్ మండలానికి చెందిన ఒక నాయకుడు, కారుమంచి గ్రామానికి చెందిన మరో యువ నాయకుడిపై అక్రమ మద్యం కేసులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే మళ్లీ మద్యం వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది.

సీఎం ఆదేశాలు బేఖాతరు

అనధికార బెల్టుషాపులు నిర్వహించినా అధిక ధరలకు మద్యం విక్రయాలు జరిపిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని, బెల్టు షాపుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించినప్పటికీ స్థానికంగా ఆదేశాలు అమలు కావడం లేదు. స్థానిక ఎమ్మెల్యే మాట కూడా లెక్కచేయని స్థితిలో కిందిస్థాయి నాయకులు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అనధికార బెల్టు షాపులను కట్టడి చేయకపోతే ప్రజలపై తీవ్ర ప్రభావం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్



నరసరావుపేటటౌన్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధూమపానం చేయటం వల్ల తాగే వారితో పాటు పక్కన వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహిస్తుందన్నారు. ఎవరైతే బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తారో వారికి రూ.200 రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో సిగరెట్లు, అమ్మిన ధూమపానం చేసిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా మైనర్లకు సిగరెట్లు అమ్మడం నేరమన్నారు.

ముగిసిన గ్రామ రెవెన్యూ సదస్సులు



నాదెండ్ల: యడ్లపాడు మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిశాయి. యడ్లపాడు సచివాలయం వద్ద గ్రామ రెవెన్యూ సదస్సులో 28 మంది రైతులు సమస్యలపై అర్జీలు అందించారు. రీసర్వే అనంతరం భూమి కొలతల్లో వ్యత్యాసాలున్నాయంటూ ఫిర్యాదు చేశారు. గత నెలలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగియగా, సుమారు 600 వరకూ అర్జీలు అందినట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. త్వరలో గ్రామ సర్వేయర్లు, సంబంధిత అధికారులతో అర్జీలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఝాన్సీ దయాసాగర్, డీటీ అనురాధ, మండల సర్వేయర్ సురేంద్రనాథ్, ఆర్ఐ జయరాజు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



వినుకొండ(నూజెండ్ల): అభివృద్ధికి ఆమడ దూరంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి పంచాయతీలో గల వైకుంఠ శివప్రసాద్ ఎస్టీ యానాది కాలనీ ఉందని సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు ప్రభుత్వాలపై మండిపడ్డారు. సీపీఐ ఆధ్వర్యంలో కాలనీలోని పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలనీలో రోడ్ల పరిస్థితి ఏమాత్రం బాగాలేక డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు సోకి ప్రజలు ఇబ్బంది పడకముందే కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొప్పరపు మల్లికార్జున, నాగరాజు, ఆదెయ్య, సుజాత, లక్ష్మి, పేరమ్మ, నాగరాణి, దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు



నరసరావుపేట రూరల్: రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఫినిక్స్ ఆధ్వర్యంలో ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రక్త గ్రూపు పరీక్షలు,హిమోగ్లోబిన్ స్థాయి కొలత క్యాంప్ నిర్వహించారు. కళాశాలలోని 200మంది విద్యార్థులు, అధ్యాపకులకు ఈ క్యాంప్‌లో రక్త పరీక్షలు జరిపారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, డైరెక్టర్ డి.శ్రావ్య, కళాశాల ప్రిన్సిపల్, పృథ్వీరాజ్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ఫణి, రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఫినిక్స్ అధ్యక్షుడు సజ్జాద్దని, జిల్లా జనరల్ సెక్రటరీ దమ్మాటి అశోక్‌కుమార్, స్వర్ణ రాజేంద్ర, క్లబ్ డైరెక్టర్స్ అమర్, పవన్, మన్సూర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నరసరావుపేట ఈస్ట్: మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామంలో ఈనెల 3వతేదీ ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తు న్నట్టు గ్రామ యువజన మిత్రబృందం ప్రతినిధులు ఉడతా జగదీష్, గోనుగుంట్ల కోటేశ్వరరావు శనివారం తెలిపారు. మిత్రబృందం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారని, వివరాలకు 96063 33444, 9676355775 సంప్రదించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం కలిగి ఉండాలి

వయోజన విద్య శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి



యడ్లపాడులో వయోజన విద్య శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, అధికారులు

నాదెండ్ల: వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం కలిగి ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో హేమలతాదేవి చెప్పారు. యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉల్లాస్ వయోజన విద్య (అక్షర వెలుగు) శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుండి వయోజనులకు చదువు నేర్పించే విద్యపై అవగాహన కల్పించారు. మొదటి విడతగా 15-60 ఏళ్ల లోపు వయస్సు గల వారికి మూడు నెలల పాటూ అక్షర జ్ఞానం నేర్పించటం జరుగుతుందన్నారు. వీరిలో 440 మందిని గుర్తించటం జరిగిందని, వీరికి వయోజన విద్య పథకం ద్వారా మూడు నెలల పాటూ చదువు నేర్పించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చనున్నట్లు చెప్పారు. ఆ తదుపరి రెండో విడతలో మిగిలిన వయస్సుల వారికి విద్య నేర్పించటం జరుగుతుందన్నారు. అక్షర జ్ఞానం ఉండటం వలన మోసాలకు గురికాకుండా వ్యవహరించగలరన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవీంద్రకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జిల్లా కోఆర్డినేటర్ డీవీ ప్రియదర్శిని, సీసీలు, బీవోఏలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శంకర భారతీపురం విద్యార్థులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి, ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీలలో పలు విభాగాలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14,17 పోటీలలో అథ్లెటిక్స్, బాల్‌బాడ్మింటన్, ఖోఖో, టెన్నికాయిడ్ క్రీడలలో ఎంపికైనట్టు తెలిపారు. అథ్లెటిక్స్‌లో సి.హెచ్.నాగవైష్ణవి, బి.రాజేశ్వరి, బాల్‌బాడ్మింటన్‌లో కె.కిరణ్‌కుమార్, ఎస్‌కె.ఆరీఫ్, జీ.భానురామ్‌ప్రసాద్, పి.రాజశ్రీ, ఖోఖోలో బి.సౌజన్య, టి.లక్ష్మీప్రసూన చంద్రిక, డి.రంగమహాలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారని వివరించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన వారు ఆయా క్రీడలకు కేటాయించిన జిల్లాల్లో, తేదీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయినీ పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, షేక్.ఫాతిమా, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఉల్లాస్ కార్యక్రమం ఎంతో ఉపయుక్తం



శావల్యాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో బ్రహ్మేశ్వరరావు


ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పెద్దలు చదవటం రాయటం నేర్పటానికి ఉల్లాస్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సిబ్బందికి ఉల్లాస్ కార్యక్రమం నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను తగ్గించటానికి ప్రభుత్వం నూతనంగా ఉల్లాస్ కార్యక్రమం అమలు చేయటం మంచి శుభపరిణామమన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు సులభతరంగా అర్థం అయ్యేలా రోజు వారి జీవితంలో ఉపయోగపడేలా వలంటీర్ టీచర్లు బోధించాలన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు మొబైల్ బ్యాంకింగ్ ఆన్‌లైన్ నగదు చెల్లింపులు తదితర అంశాలపై అవగాహన పెంపొందించాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 390 మంది మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించామని వీరందరికీ వయోజన విద్యాశాఖ వారి సారథ్యంలో వలంటీరు టీచర్ల ద్వారా బోధన జరిగేలా చర్యలు చేపట్టామన్నారు.15 నుంచి 50 సంవత్సరాల లోపు కల్గి ఉన్న వారందరినీ వయోజన విద్యతో నేర్పించాలన్నారు. అలాగే నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయాలన్నారు. మొదట అక్షరాలు, బొమ్మలు, పదాలు ద్వారా బోధన చేయాలన్నారు. ప్రతి వలంటీర్ ఉపాధ్యాయుడు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నాడు ఇచ్చే జాతీయ అవార్డును అర్హత పొందుతారన్నారు.ఈనెల 5 నుంచి కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి,ఏపీయం జి.వాసు బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత,సీసీ ఖాజావలీ, గ్రామ సమాఖ్యా వీవోఏలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ కార్యక్రమం క్రింద ఎంపికైన ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరక్షరాస్యులైన వయోజనులను విద్యావంతులుగా మార్చటమే ప్రధాన ధ్యేయమని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మేశ్వరరావు అన్నారు. ఆ మేరకు ప్రతి ఉపాధ్యాయులు నిర్దేశ్య లక్ష్యాలతో పనిచేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని వయోజనులను విద్యావంతులుగా మార్చటంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సోమశేఖర్ శర్మ, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ ఎం. సుబ్బారెడ్డి, పలువురు ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన యోగ శిక్షణ శిబిరం



అభ్యాసకులతో యోగాచార్యులు జనార్దన్‌గురూజీ

నరసరావుపేట ఈస్ట్: యోగా స్నానం శ్రేష్టమైనదని శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం ప్రధాన యోగాచార్యులు ఆతుకూరి వేంకటేశ్వర గురూజీ తెలిపారు. యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన 180వ ఉచిత యోగ శిక్షణ శిబిరం శనివారం ముగింపును పురస్కరించుకొని శ్రీపట్టాభిరామస్వామి ఆలయ ఆవరణలో ఆనంద మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన యోగాచార్యులు వేంకటేశ్వర గురూజీ యోగ అభ్యాసకులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి యోగాసనాలు, ప్రాణాయామం అభ్యాసన చేసిన అనంతరం శరీరానికి పట్టిన శ్వేద జలాలన్ని మర్థన చేయడమే యోగ స్నానంగా పేర్కొన్నారు. స్నానానంతరం గురువు తెలియచేసే ఆధ్యాత్మిక అంశాలను వినటం ద్వారా మానసిక నిర్మలత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన చేసినప్పుడే శిబిరానికి ప్రయోజకత్వం ఏర్పడుతుందని వివరించారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

నాదెండ్ల: సబ్సిడీపై రైతులకు ఇస్తున్న శనగలను సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ చెప్పారు. మండలంలోని సాతులూరు రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ ముసుగు శోభారాణి చేతుల మీదుగా రైతులకు 80 క్వింటాళ్ల శనగలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 1115 క్వింటాళ్లు శనగలు కేటాయించారని, మొదటి విడతగా సుమారు 400 క్వింటాళ్లు అందాయని, సాతులూరు గ్రామానికి 80 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. సగటున రైతుకు రెండు క్వింటాళ్లు వరకూ సబ్సిడీపై విత్తనాలు అందిస్తామన్నారు. కావలసిన రైతులు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుతో రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బి.సత్యనారాయణ, ఏఈవోలు రామారావు, వేణుగోపాల్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అక్షర వెలుగు

బొల్లాపల్లి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు పథకంలో భాగంగా నిర్వహించిన అక్షర వెలుగు కార్యక్రమంలో ఒక రోజు శిక్షణ శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పడం చేయాల్సిన బాధ్యత వెలుగు పథకం సిబ్బందిపై ఉందని తెలిపారు. గ్రామాల్లో నిరక్షరాస్యులైన వారిని గుర్తించాలని సూచించారు. శిక్షణ అనంతరం గ్రామాల్లో తప్పనిసరిగా నిరక్షరాస్యులను గుర్తించాలని, వారికి ప్రతిరోజూ సమయ సూచక ఏర్పాటు చేసుకొని ఈ విషయాలను వారికి బోధించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూచించారు. శిక్షణలో ఏపీఎం పి.వి.రంగారెడ్డి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

స్వాములకు సద్ది ఏర్పాటు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ వద్ద గల పాత శివాలయంలో గత ఐదు సంవత్సరాలుగా అయ్యప్పస్వాముల అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో రూ.6 లక్షలు వెచ్చించి వంటసామాన్లు భద్రపరిచే, వంట గదులు నిర్మించారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా అయ్యప్పస్వాములకు సద్ది ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా శనివారం నుంచి అయ్యప్ప, ఆంజనేయ, శివ స్వాములకు ప్రతి రోజూ 600మంది మధ్యాహ్నం సద్ది కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మా వెంకటరెడ్డి (బొట్టుస్వామి), రాపర్ల అనిల్‌కుమార్, ఆటో శ్రీనివాసరావు, చిన్ని, ఐరామ్మూర్తి, శ్రీనివాసరావు, వెంకటేష్, సంజీవరెడ్డి, రంగనాయకులు, గురునాథం, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార జాతను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 5న నరసరావుపేటకు రానున్న కార్మిక, రైతు సంఘాల ప్రచార జాతాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుడు సత్యనారాయణరాజు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతులపై నల్ల చట్టాలను బలవంతంగా రుద్దాలని చూస్తున్నదని ఆరోపించారు. ఈనెల 26న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, ఉప్పలపాటి రంగయ్య పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సద్వినియోగపర్చుకోవాలి



విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ చేసిన కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: వసతి గృహాన్ని తమ సొంత ఇంటిలా భావించి కళాశాల యాజమాన్యం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల యాజమాన్య ప్రతినిధులు కోరారు. కళాశాల బాలుర వసతి గృహం విద్యార్థులకు యాజమాన్యం రూ.50వేలు విలువైన స్టడీ చైర్స్ ఉచితంగా అందచేశారు. ఈసందర్భంగా పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ, వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెరిగేందుకు ప్రత్యేకంగా కబడ్డీ, బాడ్మింటన్ వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కోరారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంతలు లేని రోడ్లే ప్రభుత్వ ధ్యేయం



నరసరావుపేట: గుంతలు లేని రోడ్లను ప్రజలకు అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బాలయ్యనగర్. ఎన్జీవో కాలనీ. 60అడుగులరోడ్డు, మండలంలోని లింగంగుంట్ల, పెట్లూరివారిపాలెం గ్రామాలలో పర్యటించారు. పట్టణంలో పలు వార్డులలో సుమారు రూ.22లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్లపై గుంతలు పూడ్చే పనులను ప్రారంభించి, రెండు కల్వర్టుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, రోడ్డు రవాణా శాఖ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు వాసిరెడ్డి రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్త .. ప్రమాదాలు జరిగే స్థలమిది



జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాద నివారణకు రూరల్ పోలీసులు శనివారం చర్యలు చేపట్టారు. రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని కోమటినేనివారిపాలెం బస్‌స్టాప్ సెంటర్ వద్ద ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా ప్రమాద హెచ్చరికల సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

–చిలకలూరిపేట టౌన్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ మేడం జయరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ జయరామిరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తేనే మండలం అభివృద్ధి పథంలో ఉంటుందని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరు, వారి శాఖలో ప్రగతి నివేదికలపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, ఎంపీడీవో పావులూరి ఉమాదేవి, తహసీల్దార్ రమేష్ కుమార్, వైద్యాధికారి పుష్పేంద్ర, పశువైద్యాధికారి శివాజీ, ఏపీవో ఆంజనేయరాజు, పంచాయతీ రాజ్ ఏఈ అల్లాభక్షు, విద్యుత్ ఏఈ సుధాకర్, హౌసింగ్ ఏఈ యలమంద, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేపట్టిన దృశ్యం

చిలకలూరిపేటటౌన్: ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ పాప మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన సంఘటన శనివారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణంలోని రహమత్ నగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి, అల్లీమా దంపతుల 11 నెలల కుమార్తె అక్ష అస్వస్థతకు గురికావడంతో శుక్రవారం ఉదయం స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని రైతు బజార్ సమీపాన ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే పాప పరిస్థితి మరింత క్షీణించిందని మెరుగైన వైద్యం కోసం వెంటనే గుంటూరు తీసుకెళ్లాలంటూ వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు వెంటనే పాపను అంబులెన్స్‌లో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే పాప మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆగ్రహించిన పాప కుటుంబ సభ్యులు, బంధువులు భారీగా పట్టణంలోని వరలక్ష్మి హాస్పిటల్ వద్దకు శనివారం చేరుకుని ఆందోళన చేపట్టారు. పట్టణంలోని వైద్యం చేసిన హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ చనిపోయిందంటూ పాప కుటుంబ సభ్యులు ఆరోపించారు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ పి రమేష్ సిబ్బందితో అస్పత్రి వద్దకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులతో చర్చించి ఆందోళన విరమింపజేయడంతో వివాదం సద్దుమణిగింది.

విద్యార్థులపై స్కూల్ పీడీ కక్షసాధింపు



సంఘటనలో గాయపడ్డ అష్వక్

నరసరావుపేటటౌన్: విద్యార్థిపై దాడికి పాల్పడ్డ ప్రైవేటు స్కూల్ పీడీ పై చర్యలు తీసుకోవాలని బాధితుడి తల్లిదండ్రులు శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనసతోటకు చెందిన షేక్ మహ్మద్ అష్వక్ కోటసెంటర్‌లోని శ్రీచైతన్య ప్రైవేట్ పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్నాడు. గత నెల 23వ తేదీ స్కూల్ భవన సెల్లార్‌లో కబడ్డీ ఆడుతూ పడ్డాడు. సంఘటనలో అష్వక్ చెయ్యి విరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనపై స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. క్రీడా మైదానంలో నిర్వహించాల్సిన కబడీ శిక్షణ అనధికార సెల్లార్‌లో నిర్వహించటం ఏమిటంటూ ప్రశ్నించారు. సంఘటన జరిగిన 4 గంటల తర్వాత సమాచారం ఇచ్చారని విచారణ జరిపి పీడీపై చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యాన్ని కలిసి వారం క్రితం కోరారు. దీనిపై కక్ష పెంచుకున్న పీడీ కె. కళ్యాణ్ విద్యార్థి, అతని స్నేహితుడిని తరచూ వేధిస్తూ కొడుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్దకు వెళ్లి శనివారం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో శ్రీ చైతన్య పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పారు. ఈ మేరకు బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.